పీఏసీఎస్‌ల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

- ఎమ్మెల్యే రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్ పర్సన్ పద్మావతి
- ఉత్తరచిరువోలులంకలో సొసైటీ భవనం ప్రారంభోత్సవం


సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, కేడీసీసీ చైర్‌పర్సన్ పద్మావతి, నాయకులు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే రమేష్ బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. మండల పరిధిలోని ఉత్తరచిరువోలులంకలో రూ.21.60 లక్షలతో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనం, గోడౌన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి పారదర్శకంగా పాలనచేస్తున్నారని ప్రధానంగా బ్యాంక్‌లను బలోపేతం చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారన్నారు. మోపిదేవి మండలంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వివిధ పథకాల ద్వారా రూ.97 కోట్ల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా అవనిగడ్డలోనే ఇటీవల కిడ్నీ డయాలసిస్ కేంద్రంతో పాటు ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం కూడా ప్రారంభించామన్నారు. ఇటీవల నిర్వహించిన ఆరోగ్య సురక్ష ద్వారా నియోజకవర్గంలో 36 వేల మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, 4,600 మంది కంటి వైద్యం పొందారని గుర్తుచేశారు. పేదల పక్షపాతి జగనన్న కాగా, ఆర్థిక సంపన్నులకు ఉపయోగపడేది చంద్రబాబు అన్నారు.

దాతలకు సన్మానం

కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలో 425 సొసైటీలు ఉండగా, 57 బ్రాంచిలు రూ.1,504 కోట్ల టర్నోవర్‌తో జాతీయ స్థాయిలో 5వ స్థానంలో ఉండగా, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. పీఏసీఎస్‌లు కేవలం రైతాంగానికే కాకుండా అనేక రంగాల్లో ప్రజలకు ఉపయోగపడుతున్నాయని త్వరలో మైక్రో ఏటీఎంలు కూడా ప్రారంభిస్తామన్నారు. పీఏసీఎస్‌లకు అనుబంధంగా 74 గోడౌన్‌లు నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. జగనన్న, నిత్యం ప్రజల మధ్య ఉండే స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబును మరోసారి దీవించాలని కోరారు. బ్యాంక్ కార్యాలయ భవనం, గోడౌన్ నిర్మాణానికి అయిన అదనపు ఖర్చు కూడా ఇచ్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సొసైటీ కార్యాలయానికి స్థలం అందించిన దాతలు రెడ్రౌతు సాంబశివనారాయణ, రెడ్రౌతు పరందరామయ్య, రెడ్రౌతు సీతమ్మను ఘనంగా సన్మానించారు. అంతకుముందు దివంగతనేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పీఏసీఎస్ చైర్ పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు చింతా శ్రీనివాసరావు, కొలసాని వెంకట కృష్ణ, మాజీ చైర్మన్ రెడ్రౌతు రాంప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు రావి రాంప్రసాద్, తుటారం కృష్ణ, కోసూరు కోటేశ్వరరావు, అరజా లక్ష్మీతులసీ, ముత్యాల గోపాలరావు, జీఎస్సీ కోసూరు నాగమల్లేశ్వరరావు, బ్యాంక్ మేనేజర్ సల్మాసుల్తాన్, ఏవో షెబ్సిబా రాణి, ఎస్ఐ శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.


స్థల దాతలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

సర్పంచ్‌కు పరామర్శ

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలోని ఉత్తరచిరువోలులంక గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి విడివిడిగా సోమవారం పరామర్శించారు. సర్పంచ్ శ్రీనివాసరావుకు రోడ్డు ప్రమాదంలో కాలుఎముక విరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, బ్యాంక్ చైర్ పర్సన్లు సర్పంచ్ ఇంటి వద్ద పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, కె.శివనాగమల్లేశ్వరావు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

మోపిదేవి: వైఎస్సార్ సీపీ మండల కార్యాలయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి సోమవారం ప్రారంభించారు. మండల కేంద్రం మోపిదేవిలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం ఎదురు వీధిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి), పీఏసీఎస్ చైర్మన్ రావి రాంప్రసాద్, అరజా లక్ష్మీ తులసీ, జేఏసీ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, గ్రామ పార్టీ కన్వీనర్ కారుమూరి తాతయ్య, నందిగం అభిషేకరావు, బచ్చు దిలీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీరు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


కుళాయి వద్ద మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: తీరప్రాంత గ్రామాలకూ సమృద్ధిగా తాగునీటిని అందిస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం, ఇరాలి గ్రామాల్లో పర్యటించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేశారని, కానీ నేడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన దగ్గర నుంచి కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీటిని తీర ప్రాంత ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే అవసరం లేకుండా పోయిందన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇప్పటికే పైపులైన్ల ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిని ఏర్పాటు చేశామని చెప్పారు. ఓవర్ హెడ్ ట్యాంకర్ల నిర్మాణం పూర్తికాగానే ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఎమ్మెల్యే రమేష్‌బాబు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగునీటి సమస్య తలెత్తిందని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఈ సమస్యను కూడా అధిగమిస్తామని తెలిపారు. అనంతరం కుళాయిల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలతో మాట్లాడారు. నీటి నాణ్యతను పరిశీలించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల దాతృత్వం స్ఫూర్తిదాయకం


41వ డివిజన్‌లో నగదు అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ సూరిబాబు

మచిలీపట్నంటౌన్: తోటి పింఛనుదారుడు మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పింఛన్‌దారులు చేయూతను అందించటం అభినందనీయమని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 41వ డివిజన్‌కు చెందిన పింఛన్‌దారుడు పట్టపు వెంకటరత్నం ఇటీవల మృతి చెందాడు. తోటి పింఛన్‌దారులు ప్రతి ఒక్కరూ రూ.100లు సాయం అందించగా వచ్చిన రూ.29,600లను సోమవారం వెంకటరత్నం కుటుంబ సభ్యులకు మేయర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఈ విధానాన్ని నగరంలోని పలు డివిజన్లలో పింఛన్‌దారులు అనుసరిస్తూ తోటి పింఛనుదారుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రాంబాబు పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో..

నగరంలోని 29వ డివిజన్‌లో పింఛన్‌దారుడు కారుపర్తి నాగేశ్వరరావు మృతి చెందాడు. దీంతో తోటి పింఛన్‌దారులు రూ.100లు చొప్పున అందజేసిన రూ.41,950లను నాగేశ్వరరావు కుమారుడు సాంబశివరావుకు డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు పింఛన్‌దారులతో కలిసి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్, పింఛన్‌దారులు పాల్గొన్నారు.


29వ డివిజన్‌లో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ కేదారేశ్వరరావు

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



కోనేరుసెంటర్: రాయనపాడు సీడబ్ల్యూసీ గోడౌన్‌లో గార్డుగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కె.ప్రసాదరావు కుటుంబానికి ఎస్పీ పి.జాషువా సోమవారం ఆయన చాంబర్‌లో చెక్కును అందజేశారు. హోంగార్డులు అందరూ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేసిన రూ.3,91,210 ల చెక్కును ప్రసాదరావు భార్య కె.రాజేశ్వరికి ఎస్పీ అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో, ప్రమాదకర పరిస్థితుల్లో ఎంతో మంది సిబ్బందిని కోల్పోతున్నామని వారి మరణం పోలీస్ శాఖకు తీరని లోటైనప్పటికీ వారి కుటుంబాలకు అండగా ఉంటున్నామన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ



నాగాయితిప్ప(మోపిదేవి): ఉద్యాన పంటలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన అధికారి ఎస్.రమేష్ సూచించారు. మండల పరిధిలోని నాగాయితిప్ప గ్రామంలో రైతులకు పంట సాగుపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రైతులు ఫార్మర్ ఇంట్రస్ట్ గ్రూపు(ఎఫ్ఐజీ)గా ఏర్పడి ప్రభుత్వం ద్వారా రాయితీలు పొందవచ్చునని తెలిపారు. ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల పెంపకానికి సబ్సిడీ అందిస్తున్నామన్నారు. కొత్తగా అరటి, బొప్పాయి, జామ, కూరగాయలు సాగు చేసే రైతులు దరఖాస్తు చేసుకోని, ప్రభుత్వ సబ్సిడీ పొందాలని చెప్పారు. గ్రామ ఎడ్వైజరీ బోర్డు చైర్మన్, సభ్యులు, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుక



చల్లపల్లి: స్థానిక పడమర వీధిలో హజరత్ గౌసే ఆజం గ్యార్మీ షరీఫ్ వేడుకను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సింహాద్రి వికాస్‌బాబు జెండా ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, జెండా పెట్టారు. ఈ సందర్భంగా సింహాద్రి వికాస్ మాట్లాడుతూ.. అల్లా దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మతాలకతీతంగా గ్యార్మీ వేడుకలు నిర్వహించుకోవడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ(నాని), నాయకులు షేక్ నసీం ఘోరీ, పఠాన్ కరీముల్లాఖాన్, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, మాజీ సర్పంచ్ పైడిపాముల వెంకటేశ్వరరావు, వెనిగళ్ల తారక జగదీష్, అల్లంశెట్టి చలం, జుజ్జువరపు భాగ్యారావు, మోదుమూడి కుటుంబరావు, కొల్లూరి ముద్దుకృష్ణ, ముస్లింలు పాల్గొన్నారు.

పాడి రైతులతో సమావేశం



బొబ్బర్లంక(మోపిదేవి): మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలో పాడి రైతులతో పామర్రు పాలశీతలీకరణ కేంద్రం అధికారులు పాడి రైతు సంక్షేమం మన మతం- అలుపెరగని సేవ మన అభిమతం అనే కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, జిల్లా బోర్డు డైరెక్టర్ వి సాయివెంకటరమణ, ట్రస్ట్ డైరెక్టర్ జి.పి.మల్లికార్జునరావు, మేనేజర్ గోపీనాథ్, సంఘ అధ్యక్షులు, పాలక వర్గ సభ్యులు, సూపర్‌వైజర్, పాడి రైతులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

పెడన: మండల పరిధిలోని చేవేంద్ర గ్రామ సమీపంలో పేకాడుతున్న వారిపై పెడన పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం అర్ధరాత్రి అందిన పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామని ఎస్ఐ రవి చంద్రకుమార్ తెలిపారు. పేకాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.20,770ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రజాసంకల్పయాత్ర చారిత్రాత్మకం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాదయాత్ర చారిత్రాత్మకమని నాయకులు కొనియాడారు.

– పెడన/బంటుమిల్లి/మోపిదేవి/అవనిగడ్డ/చల్లపల్లి


మోపిదేవిలో ఎమ్మెల్యే రమేష్‌బాబుకు కేక్ తినిపిస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ పద్మావతి


పెడన మార్కెట్ యార్డులో కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ చారుమతి, నాయకులు


పెడన మంత్రి కార్యాలయంలో..


అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..


చల్లపల్లి వేడుకల్లో నాయకులు

బస్సు ప్రమాదంపై మంత్రి జోగి రమేష్ దిగ్భ్రాంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో జరిగిన బస్సు ప్రమాదం ఘటనపై రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన జరగటం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుందని, విచారణ అనంతరం ప్రమాదానికి కారణమైన వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను జయప్రదం చేయాలి


అధికారులకు సూచనలిస్తున్న ఝాన్సీలక్ష్మి

పెడన: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, అందుకు అందరినీ సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా క్రీడల అధికారి ఝాన్సీలక్ష్మి ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పెడన నియోజకవర్గంలోని ఎంపీడీవోలతో పాటు మున్సిపల్ కమిషనర్‌తో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ తేదీని త్వరలో నిర్ణయిస్తామన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ క్రీడా సంబరాల్లో క్రికెట్, ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలుంటాయన్నారు. ఈ పోటీలు మండల స్థాయిలో ఆ తరువాత నియోజకవర్గ స్థాయిలో జరుగుతాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లాకు, అక్కడ గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారుల వివరాలను ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల్లో తీసుకుంటామని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి వలంటీర్ల ద్వారా పంచాయతీ కార్యదర్శులు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. ఆయా క్రీడలకు సంబంధించిన సామగ్రి అంతా చేరిందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, పెడన, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాలకు చెందిన ఎంపీడీవోలు పిచ్చిబాబు, సుబ్బారావు, ఈవో పీఆర్డీలు, ఎంఈవోలు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం



కోడూరు/నాగాయలంక: నియోజకవర్గంలో వాతావరణం చల్లబడి తరచూ వర్షం పడుతుండటంతో దిగువ ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రైతులు ఊరట చెందారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి వర్షపు జల్లులు ఆరంభమై సోమవారం మధ్యాహ్నం వరకు చెదురు మదురుగా వర్షం పడుతునే ఉంది. నాగాయలంక మండలంలో వర్షపాతం 8. 4మిల్లీ మీటర్లు నమోదైనట్లు తహసీల్దార్ విమలకుమారి తెలిపారు. వరి పంట పొట్ట దశలో ఉండడంతో ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

ముమ్మరంగా బాణసంచా గోడౌన్ల తనిఖీ


వ్యాపారికి సూచనలిస్తున్న అధికారులు

గుడివాడరూరల్: అధికారుల అనుమతులతోనే టపాసులు విక్రయించాలని గుడివాడరూరల్ సీఐ ఏసోబు, తహసీల్దార్ కె.ఆంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన టపాసుల హోల్‌సేల్ విక్రయ గోడౌన్‌ను పోలీస్, రెవెన్యూ, ఫైర్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయదారుడి లైసెన్స్, ఇతర పత్రాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీఐ, తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా, కలెక్టర్ రాజాబాబుల ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో దీపావళి పండుగ సందర్భంగా అమ్మకాలు సాగించే బాణసంచా విక్రయ గోడౌన్‌ల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. లేనిపక్షంలో పెనుప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనిలో భాగంగానే టపాసుల గోడౌన్‌లను సందర్శించి నిర్వాహకులు తీసుకున్న జాగ్రత్తలను పరిశీలిస్తున్నామన్నారు. జాగ్రత్తలు తీసుకోని వారికి సూచనలు ఇచ్చారు. నిబంధనలకు లోబడి విక్రయాలు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి, రూరల్ ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి, రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ అనుమతులకు దరఖాస్తుల స్వీకరణ

నాగాయలంక: ఈ నెల 12వ తేదీన దీపావళి పండుగ నేపథ్యంలో మండలంలో బాణసంచా దుకాణాల ఏర్పాటునకు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేస్తున్నామని తహసీల్దార్ జె.విమలకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం మంగళవారం సాయంత్రంలోగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.